తెలుసుకొనవలయునని మనసునందూహించి ఓ బ్రాహ్మణోత్తమా! నీవెవ్వరవు? నావెంటనిట్లుదిరుగుచుండుటకు కారణంబేమి? నావలన నీకేమిపనికావలయునో ఎఱిగించినచో వెంటనే నెరవేర్పగలనని పలికిన బ్రాహ్మణుండిట్లనియె: నాయనా! నీవుమిక్కిలి అదృష్టవంతుడవు. నీసుగుణములు చూచి భాగ్యదేవత నిన్నువరించినది. నీకు మాయూరగల ద్రవ్యరాశిలో నాకు రెండుగుప్పెళ్ల ధనమిప్పింపగలవని పుట్టెడాసతో నే నిచ్చటికరుదెంచితినని వచింప వెంకటేశు బ్రాహ్మణునిమాటలకెంతయు ఆశ్చర్యమొంది అయ్యా! మీవాక్యములత్యద్భుతములుగానున్నవి. నాక్షేమి! మీయూరధనంబుండుటేమి! నేనదిమీకిప్పించుటేమి? నన్ను ఎగతాళిచేయుట మీవంటివారికి తగునా? అనిపలుక బ్రాహ్మణుండు నేనెంతమాత్రమెగతాళి సేయుటలేదు. నిజముగా నీధనంబచ్చటనున్నది. కావున "రెండుపిడికెళ్లధన మీబ్రాహ్మణున కీయవలయు"నని నీచేవ్రాలుతో ఒకచీటి వ్రాసియిచ్చినచో నేనాధనమును తప్పకపొందగలను. ఎట్లయిన నాకీయుపకారము చేయకున్న నిన్నువిడిచి పోజాలనని నిర్బంధింపమొదలుపెట్ట, వెంకటేశు తన్నాబ్రాహ్మణుడెట్లయిన వదలిపోయిన చాలునని యెంచి అతడుకోరినప్రకారము ఒకకాగితముపై వ్రాసియిచ్చెను. బ్రాహ్మణుడాకాగితము బుచ్చుకొని అత్యంత సంతోషముచ తన గ్రామమునకేగి వెనుకటివలె నాటిరాత్రి బ్రాహ్మణదంపతులయింటికేగి ఒకమూలదాగియుండి కొంతపడికి సమయముగనిపెట్టి తాదెచ్చినకాగిత మారాశిలోబడవేసి రెండుపిడికెళ్ల ధనముదీసి బొడ్డుకొంగున గట్టుకొని అంతటితో సంతుష్టిపొందక మఱిరెండు పిడికెళ్ల రూపాయలు తీయుచుండ వెనుకటివలె మఱల ధనలక్ష్మి ప్రత్యక్షమై అతనిచెంపపై రెండుదెబ్బలుకొట్టి నీకురెండుగుప్పెళ్లధనమునకు మాత్రమే హక్కు కలదు. అంతకన్న ఒక్కపైసయైన నీవుముట్టుకొనుటకు వీలులేదు. కావున నీ వికనిటనుండి వెడలిపొమ్మని బైటికి గెంటివేసి తానదృశ్యమయ్యెను. బ్రాహ్మణున కారెండుగుప్పెళ్ల ధనమనుభవించుయోగముండుటచేత గాబోలును ఆదంపతులిరువురు ఈరెండురాత్రులయందును ఒడలెఱుంగకుండ నిదురబోయిరి. ఇట్లుజరిగిన కొన్నిసంవత్సరముల కాదంపతులిరువురు కాలధర్మము నొందుటచే వారియిల్లు శిథిలమయిపోవుటయు, అటుపిమ్మట కొన్నాళ్లకు పిఠాపురమునగల ఉద్యోగి ఈగ్రామమునకువచ్చి కాపురముండుటయు తటస్థించుటచే నాతనివెంట వెంకటేశుకూడ వచ్చియుండి తనయజమానుని బట్టలుదుకుటకై ఒకరాతిబండ సంపాదింపవలయునని గ్రామమందంతటను దిరుగుచు ఈబ్రాహ్మణుల స్థలములోనున్న రాతినిగనుగొని దానిని గొనితెచ్చి దానిపై బట్టలుదుకుచుండ ఆరాతిమధ్యమున అమర్పబడియున్న మూత క్రమముగ కొన్నాళ్లకు విడిపోవుటచే వాని దండుచేయిపెట్టిచూడ తనచేవ్రాలుతోనున్న కాగితమతనికి దొరకెను. అతడదివిప్పి చదువుకొని వెనుకటి వృత్తాంతమంతయు జ్ఞప్తికిదెచ్చుకొని తొల్లి బ్రాహ్మణుడు తన ధనమీగ్రామమునయున్నదని చెప్పిన మాట వాస్తవమేయనితలచి ఆద్రవ్యమంతయు దీసుకొని అంతటినుండి నౌకరీవృత్తిమాని ఆధనంబంతయు స్వేచ్ఛగా అనుభవింపసాగెను. ఆహా! గణించువారొకరు, గుణించువారింకొకరనుమాట వాస్తవముగదా.

## లోభి: కొబ్బరికాయ

శ్రీమతి కూచిభొట్ల గంగమ్మగారు

అనగనగా ఒకవూళ్లో ఒకలోభివుండేవాడు. వాడు ఎంతడబ్బు సంపాదించినా ఒక్క కానైనా ఖర్చుపెట్టేవాడుగాదు. ఒకరోజున కార్తికసోమవారంనాడు పెళ్లాము దగ్గిరకువచ్చి "ఏమండీ! యింతడబ్బువుంది. కట్టుకుపోతారా? దానధర్మములు చేసుకోవాలిగాని, ఈవేళ అయిన ఒకకొబ్బరికాయ దేవుడికికొట్టండి" అని ఎన్నోసార్లు ప్రాధేయపడిచెప్పింది. పెళ్లాము పోరుపడలేక సరే అని బజారుకు బయలుదేరేడు. కొబ్బరికాయలకొట్టుదగ్గిరకువెళ్లి

"కాయెంత" అని అడిగేడు. "అణా" అన్నాడు కొట్టువాడు. "ఇంకా తక్కువకు ఎక్కడ దొరుకుతాయి?" అని అడిగాడు కొట్టువాడిని. తోటలోకి వెళ్లితే దొరుకుతాయని చెప్పేడు కొట్టువాడు. సరేఅని తోటకు వెళ్లేడు లోభి. తోటమాలి ఈయనను చూడగానే ఎంతో అలసివచ్చేడని ఒకకొబ్బరిచెట్టు చూపించి దానికాయను పూరికే కోసుకోమని చెప్పేడు. వచ్చినలాభమునకు చాలాసంతోషించేడు లోభి. ఆచెట్టు వంకరగా ప్రక్కనే పారుచున్న కాలువలోనికి వ్రాలి వుంది. ఆచెట్టెక్కి కాయకొయ్యబోయాడు. ఇంతట్లో కాలుజారింది. గభాలున మట్టను పట్టుకుని వెళ్లాడుచున్నాడు. ఇంతట్లో ఒకమావటివాడు ఏనుగును నీళ్లకుతీసుకుని అక్కడికే వచ్చేడు. అప్పుడు లోభి "ఓమావటీ! నీకు రెండువేలవరహాలుయిస్తాను. నన్నురక్షించవలయును" అన్నాడు. సరే మంచిదేగదా అని ఏనుగుని నీళ్లలోనికిదింపి మావటివాడు ఏనుగు మీద నిలుచుని లోభికాళ్లుపట్టుకున్నాడు. ఇంతట్లో ఏనుగుబెదరి మావటివాని కాళ్లక్రింద నుంచి లేచిపోయినది. అప్పుడు మావటివాడు "ఓలోభీ! నీకే నేను నాఏనుగునిఅమ్మి నాలుగువేలవరహాలిస్తాను. మట్ట గట్టిగాపట్టుకో" అన్నాడు. అప్పుడే ఒకగుఱ్ఱపువాడు అక్కడికివచ్చేడు. అప్పుడు మావటివాడు "ఓస్నేహితుడా? నీకు నేను నాలుగువేలవరహాలుయిస్తాను. నన్ను రక్షించవలసినది" అనెను. గుఱ్ఱపువాడు గుఱ్ఱమును నీటిలోదింపి దానిపై ఎక్కేడు. మావటివానికాళ్లుపట్టుకునేసరికి గుఱ్ఱముబెదిరి పారిపోయింది. ఇంకేముంది? అప్పుడు గుఱ్ఱపువాడు మావటివానితో "ఓమోయి! నేను నాగుఱ్ఱమునమ్మి నీకు నేను రెండువేలవరహాలనిస్తాను. గట్టిగపట్టుకో" అనెను. అంత మావటివాడు లోభితో "ఏమోయి! నీకు మొత్తము గుఱ్ఱపువాడిది నాదికలిపియిస్తాను. మట్టగట్టిగా పట్టుకో" అన్నాడు. తరువాత లోభి తనకంత డబ్బు రానున్నదని చాలాసంతోషించేడు. అంత ఆరువేలవరహాలు "యిన్ని" అవుతాయని సంతోషముపట్టలేక రెండుచేతులు విడిచిపెట్టేడు. ముగ్గురు ఏటిలోపడిచచ్చేరు. కథకంచికి వెళ్లింది. మనం యిక్కడేవున్నాము.

## ప్రాణభీతి

శ్రీమతి గాడీదమ్మిడుగు శారదాంబగారు

అనగా అనగా ఒక ఊళ్లో ఒకబీదబ్రాహ్మణుడు. ఆబ్రాహ్మణునికి సంతానము అరడజనుకు జాస్తిగా ఉండడంచేత కుటుంబసంరక్షణార్థం చాలా కష్టపడేవాడు. బీదవాడైనప్పటికి ఏదినం సంపాదన ఆదినానికే కాని ఎక్కువ సంపాదించి తన తదనంతరం కొమాళ్లకు పెట్టి పోదామనేవాడుకాడు ఆబ్రాహ్మణుడు. ఒక రోజుప్రొద్దున్నే వంటచెరుకుల కోసరం చేరువనుండు అడవికి భార్యాసమేతుడై బ్రాహ్మణుడు వెళ్లుచుండగా ఆకస్మాత్తుగా ఒకచెట్టుక్రింద ధనరాశికనపడింది వాళ్లిద్దరికి. బ్రాహ్మణునిగుండెలు హడలిపోయాయి. "అయ్యో! ఇక్కడ ప్రాణభీతివుందే! ఇక్కడ ఉండడం మోసం" అని భీతిచెందినవానిమాదిరి భార్యను లాగుతూ పరుగెత్తేడు బ్రాహ్మణుడు వెనక్కి అయినా తిరిగిచూడకుండా. వాళ్లిద్దరికి యిద్దరు రాజకుమారులు ఎదురయ్యేరు. ఎదురుకావడంతోటే "అక్కడ ప్రాణభీతివుంది. జాగ్రత్త!" అని బ్రాహ్మణుడు హెచ్చరించేడు ఆరాజనందనులను. ప్రాణభీతి అనగా ఏలాంటిదో చూదామని ఆబ్రాహ్మణుని

835